క్లుప్తంగా

ఆస్తి పన్నులో రాయితీ

చండూరు : మున్సిపాలిటీ పరిధిలోని ప్రజలు 2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఆస్తి పన్ను ఈ నెల 30వ తేదీ లోపు చెల్లిస్తే పన్నులో 5 శాతం రాయితీ కల్పిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ మొయిజుద్దీన్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

భిక్షంను తొలగించడం అప్రజాస్వామికం

మర్రిగూడ : సుంకరి భిక్షంను పీఆర్‌టీయూ నుంచి తొలగించడం అప్రజాస్వామికమని మాజీ ఎంపీపీ అనంత రాజుగౌడ్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎలాంటి ఆధారాలు లేకుండా బీసీ వర్గానికి చెందిన భిక్షంను సస్పెండ్ చేయడం తగదన్నారు. ఆయన వెంట గౌడ సంఘం మండల అధ్యక్షుడు పందుల రాములుగౌడ్, వైస్ ఎంపీపీ కట్కూరి వెంకటేష్‌గౌడ్, పీఏసీఎస్ చైర్మన్ పందుల యాదయ్యగౌడ్, వీరమళ్ల లోకేష్, నల్ల శేఖర్, పందుల యాదయ్య ఉన్నారు.

బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే ఆర్థికసాయం

కట్టంగూర్ : మండలంలోని దుగినవెల్లి గ్రామానికి చెందిన చిత్రం కనకయ్య (73) ఆదివారం అనారోగ్యంతో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య.. గ్రామానికి చేరుకుని కనకయ్య మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబ సభ్యులకు రూ.10వేల ఆర్థిక సాయం అందజేశారు. ఆయన వెంట జెడ్పీటీసీ తరాల బలరాములు, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు ఏడుకొండలు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పోగుల నర్సింహ, సర్పంచ్ వనం సైదమ్మదుర్గయ్య ఉన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక


యాదగిరిరెడ్డి, అధ్యక్షుడు

చిట్యాల : పట్టణంలోని భాగ్యనగర్ కాలనీ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం బట్టు ఐలేష్ అధ్యక్షతన ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కొంతం యాదగిరిరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా గుత్తా సతీష్‌రెడ్డి, కోశాధికారిగా గంజి శ్రీనివాస్, సంయుక్త కార్యదర్శిగా మహమ్మద్ ఆలీ, ఉపాధ్యక్షుడిగా గంజి యాదగిరి, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా బొల్లోజు సాంబమూర్తి, కార్యనిర్వాహక కార్యదర్శిగా భీంపాక లింగస్వామి, సలహాదారులుగా బట్టు ఐలేష్, కుకుడాల గోవర్ధన్, మేకల సూరిబాబు, కార్యవర్గ సభ్యులుగా కొంపెల్లి మహేష్, చెరుపల్లి గోవర్ధన్, కోట దయాకర్, రూపని ఇద్దయ్యలు ఎన్నికయ్యారు.

ఆర్థికసాయం అందజేత


చిట్యాల : నగదు అందజేస్తున్న ఉరుమడ్ల గ్రామస్తులు

చిట్యాల : మండలంలోని ఉరుమడ్ల గ్రామానికి చెందిన ఉయ్యాల లింగస్వామిగౌడ్ అనారోగ్యంతో పది రోజుల క్రితం మృతి చెందాడు. దీంతో ఆ గ్రామానికి చెందిన ఉయ్యాల ఇంటిపేరు గల వారందరూ కలిసి రూ.31 వేల ఆర్థికసాయాన్ని ఆదివారం బాధిత కుటుంబానికి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉయ్యాల లింగయ్యగౌడ్, ఉయ్యాల నాగరాజు గౌడ్, ఉయ్యాల గణపతి, ఉయ్యాల శేఖర్, ఉయ్యాల లక్ష్మయ్య, సురేష్, భాస్కర్, నాగరాజు పాల్గొన్నారు

కనగల్ : మండల పరిధిలోని పగిడిమర్రి గ్రామానికి చెందిన పగిడిమర్రి యాదయ్య, పగిడిమర్రి రామలింగం ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. వీరి కుటుంబ సభ్యులకు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు దుబ్బాక నర్సింహారెడ్డి రూ.10వేల చొప్పున ఆర్థికసాయాన్ని నల్లగొండ వైస్ ఎంపీపీ జిల్లేపల్లి పరమేష్, స్థానిక సర్పంచ్ గోలి నర్సిరెడ్డి ద్వారా ఆదివారం అందజేశారు. మాజీ ఎంపీటీసీ సుంకిరెడ్డి వెంకట్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు జగాల్‌రెడ్డి, గుండెబోయిన నరసింహ, పిన్నపురెడ్డి జాన్‌రెడ్డి, సింగం సత్తయ్య, సైదులు, పరమేష్, పవన్, సతీష్, వెంకట్‌రెడ్డి, సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు ఆత్మీయ సమ్మేళనం

గుర్రంపోడు : మండలకేంద్రంలోని రెడ్డి ఫంక్షన్ హాల్‌లో సోమవారం ఉదయం పదిగంటలకు బీఆర్‌ఎస్ ఆత్మీమ సమ్మేళనం జరుగుతుందని మండల శాఖ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు గజ్జెల చెన్నారెడ్డి తెలిపారు. సమావేశానికి రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి, నాగార్జునసాగర్ ఎమ్మెల్యే నోముల భగత్‌లు హాజరుకానున్నట్లు తెలిపారు.

కొనసాగుతున్న ఎన్‌ఎస్‌ఎస్ ప్రత్యేక శిబిరం

మిర్యాలగూడ అర్బన్ : కేఎస్‌ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్పెషల్ క్యాంపు ఆదివారం కొనసాగింది. దీనిలో భాగంగా యాద్గార్‌పల్లిలో పలు వీధుల్లో కంపచెట్లు, చెత్తను తొలగించి ప్రజలకు పారిశుద్ధ్యంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ నర్సింగ్ కోటయ్య, అకాడమిక్ కోఆర్డినేటర్ వెంకటరమణ, ఐక్యూఏసీ కో ఆర్డినేటర్ రీమిరెడ్డి పాల్గొన్నారు.

గర్భిణులకు తప్పని కష్టాలు !

- మర్రిగూడ ప్రభుత్వ ఆస్పత్రి నుంచి స్కానింగ్ మిషన్ తరలింపు
- గైనకాలజిస్ట్, రేడియాలజిస్టులు కరువు
- ప్రైవేట్‌ను ఆశ్రయిస్తున్న ప్రజలు


వైద్యం కోసం ఆస్పత్రికి వచ్చిన ప్రజలు

మర్రిగూడ : ఆస్పత్రిని అప్‌గ్రేడ్ చేస్తే తమకు మెరుగైన వైద్య సేవలు అందుతాయని భావించిన ప్రజలకు నిరాశే మిగిలింది. ఆస్పత్రి స్థాయి మారినా వైద్య సేవల్లో ఏమాత్రం మార్పు రాలేదు. దీంతో మర్రిగూడ మండలంలోని ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండల కేంద్రంలో ప్రాథమిక ఉన్నత ఆరోగ్య కేంద్రం (అప్పర్ ప్రైమరీ హెల్త్ సెంటర్) ఉండేది. ఆ ఆస్పత్రిని అప్‌గ్రేడ్ చేసి జనవరి 3న సీహెచ్‌సీ (కమ్యూనిటీ హెల్త్ సెంటర్)ని ప్రారంభించారు. అయితే మర్రిగూడ ఆస్పత్రిలో మెరుగైన వైద్య సేవలు అందకపోవడంతో ప్రైవేట్ ఆస్పత్రులను ఆశ్రయించి ఆర్థికంగా నష్టపోతున్నామని గర్భిణులకు, రోగులు వాపోతున్నారు.

వందల సంఖ్యలో రోగులు..

మర్రిగూడ మండల పరిధిలోని 20 గ్రామపంచాయతీల్లో 246 మంది గర్భిణులు అంగన్‌వాడీ కేంద్రాల్లో తమ పేర్లను నమోదు చేయించుకున్నారు. గర్భిణులే కాకుండా చండూరు, నాంపల్లి, మాల్ ప్రాంతాల నుంచి నిత్యం వందల సంఖ్యలో మర్రిగూడ సీహెచ్‌సీ కి వైద్య చికిత్స కోసం వస్తుంటారు. అయితే రోగుల అవసరాలకు తగిన పరికరాలు, ప్రత్యేక వైద్యులు మర్రిగూడ ఆస్పత్రిలో లేకపోవడంతో ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. ముఖ్యంగా గైనకాలజిస్టు లేకపోవడంతో మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

స్కానింగ్ మిషన్ ఎక్కడ !

మర్రిగూడ ప్రభుత్వ ఆస్పత్రికి ఐదేళ్ల క్రితం రూ.5లక్షలకు పైగా విలువ చేసే అల్ట్రాసౌండ్ మిషన్ తీసుకువచ్చారు. ఇటీవల ఆ మిషన్ మర్రిగూడ ఆస్పత్రి నుంచి మాయమైంది. దీనికి సరైన టెక్నీషియన్, రేడియాలజిస్టు లేకపోవడంతో పనిచేయకుండా పోతుందని మరో ఆస్పత్రికి తరలించినట్లు సమాచారం. గర్భిణులకు స్కానింగ్ సేవలు, పొట్ట సంబంధిత వ్యాధులకు స్కానింగ్ చేయడానికి మర్రిగూడ ఆస్పత్రిలో మిషన్ లేకపోవడంతో వారు ప్రైవేట్ ఆస్పత్రులను ఆశ్రయిస్తున్నారు.

గర్భిణుల అవస్థలు

మహిళలు గర్భం దాల్చిన మొదటి నెల నుంచి బిడ్డకు జన్మనిచ్చే వరకు వైద్యులు, స్కానింగ్ చేసి ఎప్పటికప్పుడు వారికి వివరించాల్సి ఉంటుంది. స్కానింగ్ సేవలు మర్రిగూడ ఆస్పత్రిలో అందుబాటులో లేకపోవడంతో ప్రైవేట్ ఆస్పత్రులను ఆశ్రయిస్తూ స్కానింగ్ ఇతర ఖర్చులతో కలిపి రూ.5నుంచి రూ.10వేల వరకు ఖర్చు చేయాల్సి వస్తోందని గర్భిణులు వాపోతున్నారు. గర్భిణులకు ప్రత్యేక వైద్య నిపుణురాలు లేకపోవడంతో నల్లగొండ, హైదరాబాద్‌లోని ఆస్పత్రులను ఆశ్రయిస్తున్నారు. ప్రభుత్వం, ఉన్నతాధికారులు స్పందించి మర్రిగూడ ఆస్పత్రిలో అల్ట్రాసౌండ్ స్కానింగ్ మిషన్‌తోపాటు రేడియాలజిస్టు, గైనకాలజిస్టులను ఏర్పాటు చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.

స్కానింగ్ కోసం ప్రైవేట్‌కు వెళ్తున్నాం

మర్రిగూడ ఆస్పత్రిలో స్కానింగ్ లేకపోవడంతో ప్రైవేట్ ఆస్పత్రికి వెళ్తున్నాం. రూ.3వేల నుంచి రూ.4వేల వరకు స్కానింగ్‌కు, మందులకు వెచ్చించాల్సి వస్తుంది. ప్రైవేట్ ఆస్పత్రిలో ఖర్చులు భరించడం పేదలకు ఇబ్బందిగా ఉంది. మర్రిగూడ ఆస్పత్రిలో గైనకాలజిస్టును ఏర్పాటు చేయాలి.


–సంగెపు శివాని, కొండూరు

మరో ఆస్పత్రికి తరలించారు

ప్రస్తుతం మర్రిగూడ సీహెచ్‌సీలో గైనకాలజిస్టు, రేడియాలజిస్టు లేనందున ఉన్నతాధికారుల సూచనల మేరకు మరో ఏరియా ఆస్పత్రికి స్కానింగ్ మిషన్ తరలించారు. రోగుల అవసరాల మేరకు ప్రభుత్వం ఆస్పత్రిలో పరికరాలను, సిబ్బంది సమకూరుస్తుంది.


–రాజేష్, వైద్యాధికారి

కేసీఆర్ నాయకత్వంలోనే తెలంగాణ అభివృద్ధి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి


హాజరైన కార్యకర్తలు

- నల్లగొండ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి

కనగల్ : సీఎం కేసీఆర్ నాయకత్వంలోనే తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి పథంలో దూసుకెళ్తోందని నల్లగొండ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి, గొర్రెలు, మేకల అభివృద్ధి కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ దూదిమెట్ల బాలరాజ్‌యాదవ్ అన్నారు. ఆదివారం మండల పరిధిలోని దర్వేశిపురం ఆలయ సమీపంలో ఓ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొని వారు మాట్లాడారు. సీఎం కేసీఆర్ రాష్ట్రంలో 24గంటల ఉచిత విద్యుత్, పల్లె పల్లెకు స్వచ్ఛమైన మంచినీరు, రైతుబంధు, కల్యాణలక్ష్మి, కేసీఆర్ కిట్ అందిస్తున్నారన్నారు. త్వరలో డబుల్ బెడ్ రూం ఇళ్లను అందిస్తామన్నారు. అంతకుముందు రేణుక ఎల్లమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి భారీ ర్యాలీగా ఆత్మీయ సమ్మేళనానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా దర్వేశిపురం మాజీ సర్పంచ్ కడమంచి మల్లయ్యతోపాటు 100 కుటుంబాలు, బోయినపల్లి గ్రామానికి కాంగ్రెస్ కార్యకర్తలు బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. అనంతరం వివిధ గ్రామాలకు చెందిన వారికి సీఎం సహాయ నిధి చెక్కులు అందజేశారు. ఈ కార్యక్రమంలో నల్లగొండ మున్సిపల్ చైర్మన్ మందడి సైదిరెడ్డి, ఎంపీపీ కరీంపాషా, జెడ్పీటీసీ చిట్ల వెంకటేశంగౌడ్, బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు అయితగోని యాదయ్యగౌడ్, ప్రధాన కార్యదర్శి జొన్నలగడ్డ శేఖర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్లు వంగాల సహదేవరెడ్డి, దోటి శ్రీనివాస్, వైస్ ఎంపీపీ రామగిరి శ్రీధర్‌రావు, మహిళా అధ్యక్షురాలు మర్రి రేణుక, స్థానిక సర్పంచ్‌లు అల్లుబెల్లి పూలమ్మ, అంజమ్మ, ఎంపీటీసీ శైలజసైదులు, అల్లుబెల్లి నర్సింహారెడ్డి ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

స్వేరో సర్కిల్ భీమ్ విందు

మర్రిగూడ : రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన స్వేరో దీక్షె–భీమ్ దీక్ష కార్యక్రమంలో భాగంగా ఆదివారం మండలంలోని సరంపేటలో స్వేరో సర్కిల్ టీం సభ్యులు భీమ్ విందు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా స్వేరో సర్కిల్ రాష్ట్ర సలహాదారురాలు పొడపంగి రాధ, రాష్ట్ర కోకన్వీనర్ కర్రోళ్ల సత్యం హాజరై మాట్లాడుతూ స్వేరో లక్ష్యాలను ముందుకు తీసుకెళ్లాలని కోరారు. రాష్ట్ర అధ్యక్షుడు కొండగళ్ల వెంకట్, మండల ఇన్‌చార్జ్ జిల్లా అశోక్, సైదులు, మండల అధ్యక్షుడు నారపాక సైదులు, వెంకటేష్, నందిని, శిరీష, వెంకటేష్, ప్రతిభ, జగన్, మధు, మల్లేష్, బాలరాజు పాల్గొన్నారు.

రాష్ట్ర సమగ్రాభివృద్ధే సీఎం లక్ష్యం


మాట్లాడుతున్న ఎమ్మెల్యే గాదరి కిశోర్, వేదికపై ఎంపీ బడుగుల, జెడ్పీ చైర్మన్ నరేందర్‌రెడ్డి


హాజరైన పార్టీ కార్యకర్తలు

- ఎంపీ బడుగుల లింగయ్య, జెడ్పీ చైర్మన్ బండా నరేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే కిశోర్

శాలిగౌరారం : రాష్ట్రంలో సమగ్రాభివృద్ధి, ప్రజా సంక్షేమ పథకాలను అమలుచేయడమే లక్ష్యంగా సీఎం కేసీఆర్ నేతృత్వంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం పనిచేస్తోందని జెడ్పీ చైర్మన్ బండా నరేందర్‌రెడ్డి, రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్యయాదవ్, తుంగతుర్తి ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం నిర్వహించిన బీఆర్‌ఎస్ పార్టీ ఆత్మీయ సమ్మేళనంలో వారు పాల్గొని మాట్లాడారు. ముందుగా వారికి బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు, మహిళలు బోనాలు, బతుకమ్మలతో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజలకు మౌలిక వసతుల కల్పన కోసం నిరంతరం పాటుపడుతున్నామన్నారు. ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్ మాట్లాడుతూ కేంద్రం అవినీతి, ప్రజావ్యతిరేక విధానాలను ఎండగట్టేందుకు బీఆర్‌ఎస్ పార్టీ ప్రయత్నిస్తుంటే.. తట్టుకోలేక ఐటీ, ఈడీ, సీబీఐలను వాడుకుంటూ కేంద్రం బెదిరింపులకు పాల్పడుతోందన్నారు. జెడ్పీ చైర్మన్ బండా నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 12 నియోజకవర్గాల్లో బీఆర్‌ఎస్ పార్టీ గెలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

బీఆర్‌ఎస్‌లో చేరిన నూక కిరణ్‌కుమార్

టీ పీసీసీ అధికార ప్రతినిధి నూక కిరణ్‌కుమార్, డీసీసీ ఉపాధ్యక్షుడు నూక సత్తయ్య, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బండమీది రమేశ్, శాలిగౌరారం ఎంపీటీసీ జోగు సైదమ్మ, వల్లాల సర్పంచ్ షేక్ ఇంతియాజ్‌లతో పాటు వివిధ గ్రామాలకు చెందిన 500 మంది కార్యకర్తలు ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ నేతృత్వంలో ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్, జెడ్పీ చైర్మన్ బండా నరేందర్‌రెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు అయితగోని వెంకన్న అధ్యక్షతన జరిగిన ఆత్మీయ సమ్మేళనంలో ఎంపీపీ గంట లక్ష్మమ్మ, జెడ్పీటీసీ ఎర్ర రణీల, వైస్ ఎంపీపీ కందుల అనిత, సింగిల్ విండో చైర్మన్ తాళ్ళూరి మురళి, రైతుబంధు మండల కోఆర్డినేటర్ గుండా శ్రీనివాసులు, నాయకులు కట్టా వెంకట్‌రెడ్డి, మామిడి సర్వయ్య, గంట శంకర్, చాడ హతీష్‌రెడ్డి, చామల మహేందర్‌రెడ్డి, చింత ధనుంజయ్య, పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

సర్వాయి పాపన్నకు ఘన నివాళి


నకిరేకల్ : సర్వాయి పాపన్న చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య


చండూరులో సర్వాయి పాపన్న విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు


కట్టంగూర్‌లో పాపన్న చిత్రపటానికి నివాళులర్పిస్తున్న గౌడసంఘం నాయకులు


కేతేపల్లిలో పాపన్నగౌడ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న గౌడసంఘం ప్రతినిధులు


మునుగోడు : పాపన్న చిత్రపటానికి నివాళులర్పిస్తున్న గౌడ సంఘం నాయకులు


మర్రిగూడ : నివాళులర్పిస్తున్న గౌడ సంఘం నాయకులు

చండూరు : సర్దార్ సర్వాయి పాపన్న 313వ వర్ధంతిని చండూరు మున్సిపల్ కేంద్రంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. పాపన్న విగ్రహానికి గౌడ సంఘం నాయకులు భీమనపల్లి శేఖర్, వడ్డెపల్లి గోపాల్‌గౌడ్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. పందుల వెంకన్న, మొగుదాల చిన్న దశరథ, సరికొండ వెంకన్న, దశరథ, బెల్లంకొండ శేఖర్, బోడ లవకుమార్, పందుల సత్యం, బోడ శ్రీను, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కల్లుగీత కార్మిక సంఘం ఆధ్వర్యంలో..

చండూరు మండలం నెర్మట గ్రామంలో కల్లు గీత కార్మిక సంఘం ఆధ్వర్యంలో సర్వాయి పాపన్న వర్ధంతిని నిర్వహించారు. పాపన్న చిత్రపటానికి కల్లు గీత కార్మిక సంఘం నాయకుడు ధనంజయ్య పూలమాల వేసి నివాళులర్పించారు.

నకిరేకల్ : సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ వర్ధంతిని ఆదివారం నకిరేకల్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పాపన్న చిత్రపటానికి ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రాచకొండ శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

బీసీ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో..

నకిరేకల్‌లో బీసీ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ వర్ధంతి వేడుకలను ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బొల్లేపల్లి స్వామిగౌడ్, కొండ శంకర్‌గౌడ్, అర్రూరి వెంకటేశ్వర్లు, పగిళ్ల వెంకన్న, నాతి మహేష్‌గౌడ్ పాల్గొన్నారు.

వివిధ సంఘాల ఆధ్వర్యంలో..

నకిరేకల్‌లో గౌడ సంఘం ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో సంఘం అధ్యక్షుడు కొండ జానయ్యగౌడ్, భూపతి వెంకటనారయణ, కొండ యాదగిరిగౌడ్, లక్ష్మీనారాయణగౌడ్ తదితరులు పాల్గొన్నారు. టీపీసీసీ నేత దైద రవీందర్ ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో వార్డు కౌన్సిలర్ గాజుల సుకన్య, నాయకులు కర్నాటి సైదులుగౌడ్, కృష్ణారెడ్డి, యూసఫ్ తదితరులు పాల్గొన్నారు. కల్లుగీత సంఘం ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో నాయకులు రాచకొండ వెంకట్‌గౌడ్, గుడుగుంట్ల బుచ్చిరాములు, కొప్పుల అంజయ్య, తుమ్మల వెంకటయ్య పాల్గొన్నారు.

కేతేపల్లి : మండల కేంద్రంలో ఆదివారం సర్దార్ సర్వాయ్ పాపన్నగౌడ్ 313వ వర్ధంతిని గౌడసంఘం ప్రతినిధులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాపన్న చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. గౌడ ఐక్య సాధన సమితి రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు మాదాసు విజయరాణి, నాయకులు టంగుటూరి వెంకన్న, మాందాసు పున్నయ్య, మహేష్, మాందాసు వెంకన్న, మారగోని పున్నయ్య, భీమనపల్లి వెంకన్న, నరేష్, నాగరాజు, వీరు, గోపయ్య తదితరులు పాల్గొన్నారు.

మునుగోడు : సర్వాయి పాపన్న 313వ వర్ధంతి సందర్భంగా ఆదివారం మునుగోడు అంబేద్కర్ చౌరస్తాలో ఆయన చిత్రపటానికి తెలంగాణ గౌడ సంక్షేమ సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు బొడ్డు నాగరాజుగౌడ్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర నాయకుడు పాలకూరి నర్సింహగౌడ్, మండల అధ్యక్షుడు అనంత శ్రీనివాస్‌గౌడ్, మాదగోని నరేందర్ గౌడ్, మాదగోని దేవలోకం, కొంపల్లి సైదులు, భీమగోని ముత్యాలు, పాలకూరి మారయ్య, పాలకూరి స్వామి, రవి పాల్గొన్నారు.

మర్రిగూడ : పాపన్నగౌడ్ వర్ధంతి సందర్భంగా మండల కేంద్రంలోని ఆయన విగ్రహానికి ఆదివారం గౌడ సంఘం నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సంఘం మండల అధ్యక్షుడు పందుల రాములుగౌడ్, అంజయ్యగౌడ్ చెరుకు శ్రీరామ్‌గౌడ్, గుణగంటి యాదయ్య, సుంకరి మల్లేష్‌గౌడ్, పగడాల రఘు, అంబాల రవి, రావుల రాములు, పోలె సైదులు, వీరమల్ల వెంకన్న తదతరులు పాల్గొన్నారు.

కట్టంగూర్‌లో..

కట్టంగూర్ : సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 313వ వర్ధంతిని పరడ, కట్టంగూర్, బొల్లేపల్లి గ్రామాల్లో గౌడ సంఘం నాయకులు ఆదివారం ఘనంగా నిర్వహించారు. పరడ గ్రామంలో పాపన్న విగ్రహానికి తెలంగాణ గౌడ సంక్షేమ సంఘం ఉమ్మడి జిల్లా కార్యదర్శి బద్దం శ్రీనివాస్‌గౌడ్ పూలమాల వేసి నివాళులర్పించారు. మండలకేంద్రంలో పాపన్న చిత్రపటానికి గౌడ సంఘం అధ్యక్షుడు కొంపెల్లి యాదయ్య పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయా కార్యక్రమాల్లో బద్దం రాములు, దండెంపల్లి సైదులు, బద్దం భిక్షం, కొండ నర్సింహ, అంతటి శ్రీను, పెద్ది బాలనర్సింహ, ఎర్కల లక్ష్మీనారాయణ, పోగుల నర్సింహ, యాదగిరి, రాచకొండ యాదయ్య ఉన్నారు.

వంగాల రామ్మోహన్‌కు ఘన సన్మానం

రామగిరి (నల్లగొండ) : నల్లగొండలోని శివాజీ నగర్ ఎస్‌బీఐ డిప్యూటీ మేనేజర్‌గా బాధ్యతలు నిర్వర్తించి పదవీ విరమణ పొందిన వంగాల రామ్మోహన్‌కు ఆదివారం స్థానిక ఫంక్షన్ హాల్‌లో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బ్యాంకు సిబ్బంది, స్నేహితులు ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆయిల్ ఫెడ్ చైర్మన్ కంచర్ల రామకృష్ణారెడ్డి, వంగాల వెంకట్ నరసింహ రాజు, సుధాకర్‌రెడ్డి, వైద్యుల యాదగిరి, పోరెడ్డి నరసింహారెడ్డి, తీగల మోహన్‌రావు పాల్గొన్నారు.


రామ్మోహన్‌ను సన్మానిస్తున్న ఆయిల్ ఫెడ్ చైర్మన్ రామకృష్ణారెడ్డి, బ్యాంక్ ఉద్యోగులు, స్నేహితులు

పదో తరగతి పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

కేతేపల్లి: పదో తరగతి పరీక్షల నిర్వహణకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. చెరుకుపల్లి, కేతేపల్లి గ్రామాల్లో రెండు పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. మండలంలో మొత్తం 413 మంది విద్యార్థులకు గాను కేతేపల్లి కేంద్రంలో 247 మంది విద్యార్థులు, చెరుకుపల్లి కేంద్రంలో 166 మంది పదో తరగతి పరీక్షలు రాయనున్నారు. ఆయా కేంద్రాలకు చీఫ్ సూపరింటెండెంట్‌లుగా మురళీకృష్ణ, వెంటక్‌రెడ్డి, డీఓలుగా శైలజ, రమాదేవి వ్యవహరించనున్నారు. సోమవారం ఉదయం 9.30 గంటలకు పరీక్ష ప్రారంభమై 12.30 గంటలకు ముగుస్తుందని అధికారులు తెలిపారు

కనగల్ : పదో తరగతి వార్షిక పరీక్షలకు పకడ్బందీగా ఏర్పాట్లు పూర్తి చేసినట్లు మండల విద్యాధికారి తరి రాములు తెలిపారు. మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో పరీక్ష కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మండల వ్యాప్తంగా 275మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నట్లు ఆయన పేర్కొన్నారు. చినమాదారం పాఠశాలకు చెందిన 30మంది విద్యార్థులు, చర్లగౌరారం పాఠశాలకు చెందిన 12మంది విద్యార్థులు నల్లగొండ పట్టణంలో పరీక్ష రాస్తారన్నారు. పరీక్ష సెంటర్‌కు అరగంట ముందే విద్యార్థులు చేరుకోవాలన్నారు. విద్యార్థులు ఒత్తిడికి లోను కాకుండా ధైర్యంగా రాయాలన్నారు.

పీఆర్‌టీయూ బలోపేతానికి సహకరిస్తా


పీఆర్‌టీయూ నాయకులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే భాస్కర్‌రావు

మిర్యాలగూడ : నియోజకవర్గంలో పీఆర్‌టీయూ బలోపేతానికి సహకరిస్తానని మిర్యాలగూడ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు తెలిపారు. ఆదివారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గంలోని ఆరు మండలాల సంఘం అధ్యక్ష, కార్యదర్శులతో చర్చించిన అనంతరం ఆయన మాట్లాడారు. సంఘం తీసుకున్న నిర్ణయాలే శరణ్యమని వ్యక్తిగత అభిప్రాయాలు ముఖ్యం కాదన్నారు. పీఆర్‌టీయూ రాష్ట్ర సంఘం తీసుకున్న నిర్ణయానికి అందరూ కట్టుబడి ఉండాలని అన్నారు. తప్పు చేసిన వారిని సంఘం ఎప్పుడైనా శిక్షించే అధికారం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జిల్లా ప్రధాన కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి, రాష్ట్ర పత్రికా సంపాదక వర్గ సభ్యులు నర్సింహానాయక్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు కాశీయాదవ్, గోపినాయక్, మదార్ తదితరులు పాల్గొన్నారు.

పెన్షన్‌దారుల తిప్పలు తీరేదెప్పుడు !


ఆసరా పెన్షన్ తీసుకునేందుకు కాలినడకన మునుగోడు వెళ్తున్న వృద్ధులు

మునుగోడు : ప్రతి నెల ప్రభుత్వం వృద్ధులకు, దివ్యాంగులకు, వితంతువులకు అందిస్తున్న ఆసరా పెన్షన్లు తీసుకునేందుకు మండలంలోని జక్కలవారిగూడెం లబ్ధిదారులు తిప్పలు పడాల్సి వస్తోంది. జక్కలవారిగూడెం నాలుగేళ్ల క్రితం నూతన గ్రామ పంచాయతీగా ఏర్పాటైనప్పటికీ గతంలో వలె లబ్ధిదారులు మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న మునుగోడుకు వెళ్లి పెన్షన్ తీసుకుంటున్నారు. వారు వెళ్లేందుకు బస్సు సౌకర్యం కూడా లేకపోవడంతో మునుగోడుకు కాలి నడకన వెళ్లేందుకు పడరాని పాట్లు పడుతున్నారు. తమ గ్రామంలోని పెన్షన్‌దారులకు ఇక్కడే పెన్షన్ ఇవ్వాలని ఆ గ్రామ సర్పంచ్, ఇతర నాయకులు అధికారులకు అనేకమార్లు వినతులు ఇచ్చారు. సాక్షి దినపత్రికలో రెండు నెలల క్రితం ప్రత్యేక కథనం ప్రచురించినా ప్రయోజనం లేకుండా పోయింది. గ్రామంలో మొత్తం 60 మందికిపైగా పెన్షన్‌దారులు ఉండగా అందులో 45 మంది వృద్ధులు, 6 గురు దివ్యాంగులు, 9 మంది వితంతువు పెన్షన్‌దారులు ఉన్నారు. సంబంధిత అధికారులు చొరవ తీసుకొని గ్రామంలోనే తమకు పెన్షన్ డబ్బులు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని లబ్ధిదారులు వేడుకుంటున్నారు.

సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలి

త్రిపురారం : వివిధ పరిశ్రమల్లో పనిచేస్తున్న కార్మికులకు సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు అంబటి సోమయ్య డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలో ఐఎన్‌టీయూసీ త్రిపురారం మండల కమిటీ సభ్యులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మిక చట్టాలను నిర్వీర్యం చేస్తూ బడా పారిశ్రామిక వేత్తలకు దేశ సంపదను దోచి పెడుతున్నారన్నారు. అనంతరం ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు అంబటి సోమయ్యను త్రిపురారం సంఘం ఆధ్వర్యంలో శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఐఎన్‌టీయూసీ యూత్ జిల్లా అధ్యక్షుడు నూకపంగ నాగయ్య, జిల్లా వైస్ ప్రెసిడెంట్ పరిక వెంకటేశ్వర్లు తదితరులున్నారు.

మట్టలాదివారం పండుగ

కేతేపల్లి : మండలంలోని వివిధ గ్రామాల్లో క్రైస్తవులు ఆదివారం మట్టలాదివారం పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఇనుపాముల, కేతేపల్లి, భీమారం, కొర్లపహాడ్ తదితర గ్రామాల్లో క్రైస్తవ భక్తులు తాటి, ఈత ఆకులతో రూపొందించిన శిలువలను చేత పట్టుకుని ప్రదర్శన నిర్వహించారు. అనంతరం ఆయా చర్చిలలో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. భక్తి గీతాలు ఆలపిస్తూ ఏసుక్రీస్తును స్తుతించారు.

జెడ్పీ చైర్మన్, ఎమ్మెల్యే చిత్రపటాలకు పాలాభిషేకం

నార్కట్‌పల్లి : మండలంలోని చిన్నతుమ్మలగూడెం నుంచి చిప్పలపల్లి ఎస్సీ కాలని వరకు కోటి రూపాయలతో బీటీ రోడ్డు నిర్మాణానికి జెడ్పీ చైర్మన్ బండా నరేందర్‌రెడ్డి, నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య నిధులు మంజూరు చేయించడంపై హర్షం వ్యక్తం చేస్తూ వారి చిత్రపటాలకు చిప్పలపల్లి గ్రామస్తులు ఆదివారం పాలాభిషేకం చేశారు. నిధుల మంజూరుకు సహకరించిన ఎంపీపీ సూదిరెడ్డి నరేందర్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. రైతు బంధు జిల్లా డైరెక్టర్ బండ అమృతరెడ్డి, బీఆర్‌ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు సురేష్‌కుమార్, పాటి వెంకట్‌రెడ్డి, పర్వతాలు, స్వామి, ఎల్లేష్, తదితరులు ఉన్నారు.


పాలాభిషేకం చేస్తున్న గ్రామస్తులు